క్లుప్తంగా

రూ.లక్ష విలువైన కొబ్బరికాయలు దగ్ధం



అగ్నిప్రమాదంలో కాలుతున్న కొబ్బరికాయల పాక

ఎస్.రాయవరం : ఎస్.రాయవరంలో కొబ్బరికాయలతో నిల్వ ఉన్న పూరిపాక శనివారం దగ్ధం కావడంతో సుమారు లక్ష రూపాయలు వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయారు. గ్రామానికి చెందిన వెలగా శ్రీను పాకలో కొన్ని నెలలుగా తోటలో నుంచి సేకరించిన సుమారు 20 వేల కొబ్బరికాయలను నిల్వ చేసుకున్నట్టు చెప్పారు. అయితే ప్రమాదవశాత్తూ నిప్పంటుకుని పాక మొత్తం కాలిబూడిదైందన్నారు. ఇందులో ఉన్న కొబ్బరికాయలు పూర్తిగా కాలిపోయాయన్నారు. వివరాలు మేరకు రెవెన్యూ అధికారులు నష్టం వివరాలు అంచనా వేస్తున్నట్టు చెప్పారు.

చూచుకొండలో నగర సంకీర్తన



చూచుకొండలో నగరసంకీర్తనలో పాల్గొన్న భక్తులు

మునగపాక : మండలంలోని చూచుకొండ గ్రామంలో నగర సంకీర్తన కార్యక్రమం ఘనంగా సాగుతుంది. ధనుర్మాసంలో భాగంగా గ్రామానికి చెందిన సుమారు 200 మంది మహిళలు, పురుషులు కలిసి నగర సంకీర్తనలో భాగస్వామ్యులవుతున్నారు. ధనుర్మాస ఉత్సవ కమిటీలో భాగంగా గ్రామంలోని అన్ని దేవాలయాల వద్ద సామూహిక హారతి కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం తెల్లవారున నిర్వహించిన నగర సంకీర్తనలో భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

గరుడ వాహనంపై గోపాలుడు



స్వామివారికి తిరువీధి సేవలు నిర్వహిస్తున్న అర్చకులు

నక్కపల్లి : ధనుర్మాస అధ్యయనోత్సవాల్లో భాగంగా ఉపమాక వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం గరుడ వాహనంపై స్వామివారికి తిరువీధి సేవలు నిర్వహించారు. ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు నిత్యాభిషేకం, అర్చనలు నిర్వహించారు. అనంతరం బాల భోగ నివేదన, రాజభోగ నివేదన, నీరాజన మంత్రపుష్పాలు తీర్థగోష్టి, ప్రసాద వినియోగం నిర్వహించారు. రాత్రి స్వామివారిని పల్లకీలో ఊరేగించారు. గోదాదేవి అమ్మవారి సన్నిధిలో తిరుప్పావై 22వ పాశురాన్ని విన్నపం చేశారు.

గ్రంథాలను చదవడం అలవరుచుకోవాలి



నాగులాపల్లిలో గ్రంథాలను అందజేస్తున్న దృశ్యం

మునగపాక : ప్రతి ఒక్కరూ దైవదర్శనాలతో పాటు గ్రంథాలను చదువుకోవడం ద్వారా విజ్ఞానంతో పాటు ప్రశాంతంగా ఉండవచ్చని హిందూ జ్ఞానవేదిక కమిటీ అధ్యక్షుడు త్రినాథరావు పేర్కొన్నారు. నాగులాపల్లిలో శనివారం హిందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గ్రంథాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం అందరిపైనా ఉందన్నారు. ధనుర్మాసంలో దైవ క్షేత్రాలను దర్శించడం ద్వారా మంచి జరుగుతుందన్నారు. భగవద్గీత, భారతం, రామాయణంపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పైడన్న, శ్రీనివాస్, భవాని, రాజు, మణి, లక్ష్మి పాల్గొన్నారు.

అవినీతి రహిత పాలనే ముఖ్యమంత్రి లక్ష్యం

- ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు
- వృద్ధులకు నూతన పింఛన్ల పంపిణీ



నూతన పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు, జగన్నాథం

యలమంచిలి : రాష్ట్రంలో అవినీతి రహిత పాలన అందించడమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబు) అన్నారు. శనివారం సాయంత్రం యలమంచిలి పట్టణంలో మున్సిపల్ కార్యాలయంలో వృద్ధులకు కొత్త పింఛన్లు అందజేశారు. వృద్ధులతో కలసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో పెద్ద కొడుకులా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదుకుంటున్నారని, కానీ ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబునాయుడు మతిభ్రమించి ప్రభుత్వంపై తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో తిండి లేని పేద పిల్లలకు చదువు అందించాలనే లక్ష్యంతో అమ్మఒడి, జగనన్న గోరుముద్దతో పౌష్టికాహారం అందించడం ద్వారా విద్యార్థులకు చక్కని చదువు అబ్బుతుందని, రాష్ట్రంలో రైతులకు ఎంతో మేలు జరుగుతోందని ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్ట్ పూర్తవడం ద్వారా ఉత్తరాంధ్ర ప్రజలు కష్టాలు తీరనున్నాయని అన్నారు. అవ్వా తాతలకు దఫదఫాలుగా పింఛను పెంచిన ఘనత వైఎస్సార్ కుటుంబానికే చెల్లిందని అన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిశీలకుడు రొంగలి జగన్నాథం మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అధిక సంఖ్యలో అందించి సుపరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ప్రతిపక్షాలు ఎన్ని విమర్శలు గుప్పించినా ఎన్ని పార్టీలు కలిపినా జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల ఆశీస్సులు మెండుగా ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోదెపు గోవింద్, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరావు, అర్రెపు గుప్త, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బొద్దపు యర్రయ్యదొర, రూరల్ పార్టీ అధ్యక్షుడు కొల్లి త్రినాథ్, వైస్ ఎంపీపీ రాజాన శేషు, కౌన్సిలర్లు కర్రి శివ, సర్పంచ్‌లు వైఎస్సార్‌సీపీ నాయకులు సేనాపతి రాము పాల్గొన్నారు.

ఎన్నికల హామీల అమలు ఘనత జగనన్నదే

మునగపాక : ఎన్నికల హామీలను అమలు చేస్తూ దేశంలోనే ఆదర్శముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి గుర్తింపు పొందుతున్నారని ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు(కన్నబాబు) అన్నారు. అర్హులందరికీ పింఛన్లు రాజకీయాలకు అతీతంగా అందజేస్తున్నామన్నారు. గంటవానిపాలెం గ్రామంలో నూతనంగా మంజూరైన పింఛన్‌లను ఆయన శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు అర్హులైన నిరుపేదలకు పింఛన్లు పెంచుతామని ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారన్నారు. నియోజకవర్గంలో 1200 మందికి పైగా కొత్త పింఛన్లు మంజూరయ్యాయన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయం, వలంటీర్ వ్యవస్థ మెరుగైన ఫలితాలు ఇస్తుందన్నారు. నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు రొంగలి జగన్నాథం మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న స్వరాజ్యం సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందన్నారు. మరో 30 సంవత్సరాల పాటు సీఎంగా జగన్ మోహన్‌రెడ్డి ఉండాలని ప్రజలంతా కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమానికి ముందు సీఎం జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి లబ్ధిదారులతో కలిసి క్షీరాభిషేకం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, తహసీల్దార్ బాబ్జీ, ఎంపీడీవో రవికుమార్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత అరిగా శ్రీనివాసరావు, సర్పంచ్ కోన వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

మూడేళ్లలో ఎంతో అభివృద్ధి



మోసయ్యపేటలో వృద్ధురాలికి అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

అచ్యుతాపురం (అనకాపల్లి) : బడుగు బలహీన వర్గాలకు అండగా నిలవడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని యలమంచిలి ఎమ్మెల్యే ఉప్పలపాటి రమణమూర్తిరాజు (కన్నబాబు) అన్నారు. అచ్యుతాపురం మండలంలోని మోసయ్యపేటలో శనివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన గ్రామంలో ఇంటింటికీ వెళ్లి నవ రత్నాల కరపత్రాలు పంపిణీ చేశారు. మూడేళ్లుగా చేపట్టిన అభివృద్ధి పనుల గురించి వివరించారు. స్థానికుల సమస్యల గురించి ఆరా తీశారు. ఎటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి గ్రామంలో మంచాన పడి కుటుంబాన్ని పోషించలేకపోతున్న అశోక్ అనే యువకునికి పది వేల రూపాయల నగదు అందజేసి ఎమ్మెల్యే రమణమూర్తిరాజు తన ఉదారతను చాటుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పంచదార్ల పైడిరాజు, చోడపల్లి సర్పంచ్ గండిబోయిన వెంకట్, ఎంపీపీ కోన సంధ్య బుజ్జి, జెడ్పీటీసీ లాలం రాంబాబు, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్‌రావు, ఎంపీటీసీ లాలం శ్రీను, పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

డ్రైనేజీలు లేక తప్పని అవస్థలు



పాత తంగేడులో సీసీ రోడ్డుపై పారుతున్న మురుగునీరు

కోటవురట్ల: పాత తంగేడులో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పలు వీధుల్లో సీసీ రోడ్లు ఉన్నా డ్రైనేజీలు నిర్మించకపోవడంతో ఇళ్లల్లోని వాడుక నీరంతా రోడ్డుపైకి చేరి మురుగు కూపం తయారైంది. నాచుపట్టి, బురదమయంగా మారడంతో పాదచారులు నానా అవస్థలు పడుతున్నారు. రాత్రి వేళల్లో వృద్ధులు జారిపడుతున్నారని, అధికారులు స్పందించి డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. మురుగు కారణంగా దోమల వ్యాప్తితో రోగాలు చుట్టుముడుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ధాన్యం కొనుగోలుపై అవగాహన కల్పించాలి



తిమ్మాపురం రైతు భరోసా కేంద్రాన్ని సందర్శిస్తున్న డీఏవో మోహన్

ఎస్.రాయవరం : రైతులను అన్ని విధాలా ఆదుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అవసరమైన చోట ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తోందని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్ అన్నారు. తిమ్మాపురం గ్రామంలో రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడమే కాకుండా నిత్యం గ్రామాల్లో రైతులు ధాన్యం విక్రయాలపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం వ్యవసాయ సహాయకులతో మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న రైతు భరోసా సహాయకులు రైతులను క్షేత్ర స్థాయిలో సమీక్షించి వేస్తున్న పంట మెలకువలు చెప్పాలన్నారు. రబీ పంట ఈ క్రాప్ నమోదు వేగవంతం చేయాలన్నారు. ప్రతి పంట ఈ క్రాప్ నమోదు అయితేనే ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు వస్తాయన్నారు. ఈ సందర్శనలో వ్యవసాయాధికారి సౌజన్య, రైతు భరోసా సహాయకులు ఉన్నారు.

జాతీయ రహదారిపై రెయిలింగ్ తొలగిస్తే చర్యలు



హెచ్చరిక ఫ్లెక్సీని ఏర్పాటు చేయిస్తున్న సీఐ రవికుమార్

కశింకోట: ప్రమాదాల నివారణకు జాతీయ రహదారి మధ్య డివైడర్లపై అమర్చిన రెయిలింగ్ (గ్రిల్స్)ను అనధికారికంగా తొలగించరాదని, అందుకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అనకాపల్లి గ్రామీణ సీఐ ఎ.రవికుమార్ హెచ్చరించారు. హైవే అథారిటీ సిబ్బందితో కలిసి సీఐ, ఎస్ఐ ఆదినారాయణరెడ్డి జాతీయ రహదారిపై రెయిలింగ్‌ను శనివారం పరిశీలించారు. డివైడర్‌పై అమర్చిన రెయిలింగ్‌ను పలుచోట్ల రాకపోకల కోసం స్థానికులు తొలగించారు. ఆ ప్రాంతాల వద్ద రెయిలింగ్‌ను సీఐ పునరుద్ధరించి, హెచ్చరిక ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. రెయిలింగ్‌ను ఎవరైనా అనధికారికంగా తొలగిస్తే చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా సీఐ హెచ్చరించారు.

జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి మంజులవాణి

మునగపాక:జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి మంజులవాణి కోరారు. శనివారం సాయంత్రం ఆమె హౌసింగ్ డేలో భాగంగా తోటాడ-పాటిపల్లి లే-అవుట్‌ను సందర్శించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టే వారికి ప్రభుత్వం నుంచి సాయం అందుతుందన్నారు. అలాగే కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. కాలనీల్లో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇళ్ల పట్టాలు అందజేస్తామన్నారు. తహసీల్దార్ బాబ్జీ,ఎంపీడీవో రవికుమార్, వెలుగు ఏపీఎం కొండమ్మ తదితరులు ఆమె వెంట పాల్గొన్నారు. అనంతరం తోటాడ సచివాలయాన్ని మండల ప్రత్యేకాధికారి సందర్శించారు. సచివాలయ ఉద్యోగుల హాజరుతో పాటు రికార్డులు పరిశీలించారు. యూనిఫాం ధరించని వీఆర్వోకు రూ.వంద జరిమానా విధించారు. సచివాలయాలకు వచ్చే అర్జీదారులకు సకాలంలో సేవలందించేలా చూడాలని ఆదేశించారు.

వచ్చేనెల 20లోగా ఈ-క్రాప్ నమోదు

అనకాపల్లి టౌన్: రైతులందరూ ఫిబ్రవరి 20వ తేదీ లోగా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు తెలిపారు. పట్టణంలోని గవరపాలెం రైతుభరోసా కేంద్రంలో శనివారం డివిజన్ వ్యవసాయాధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 21వ తేదీ నుంచి 28వతేదీ వరకు సామాజిక తనిఖీ కోసం జాబితాను ఉంచుతామన్నారు. మార్చి 1 నుంచి 5వతేదీ వరకు స్థానిక రైతు భరోసా కేంద్రాల్లో అభ్యంతరాలు స్వీకరిస్తామని తెలిపారు.

పశు పోషణకు ప్రభుత్వం ప్రాధాన్యం



పశు వైద్య శిబిరంలో రైతులకు మందులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ బోదెపు గోవింద్

యలమంచిలి : రాష్ట్రంలో పశు పోషణకు ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రాధాన్యమిస్తుందని ఎంపీపీ బోదెపు గోవింద్ అన్నారు. శనివారం మండలంలో రుక్మిణీపురం గ్రామంలో జగనన్న పాల వెల్లువ పథకంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న పశు వైద్య శిబిరంను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంచార వాహనంలో వైద్యులు, సిబ్బంది అత్యవసర చికిత్సలు కొరకు సిబ్బందితో కూడిన వసతులు కల్పించి పశువులకు వైద్యం అందేలా ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, వాహనంలో మందులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. అనంతరం రైతులకు పశువుల మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణీ రాము, జిల్లా పశు సంవర్ధక అధికారి డాక్టర్ ప్రసాదరావు, డీఎల్‌డీవో డాక్టర్ రామమోహనరావు, పశు వైద్యాధికారులు దేవరాజు, బానుబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు కరణం సత్తిబాబు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల పురోగతిపై పరిశీలన

ఎస్.రాయవరం : గ్రామాల్లో జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలు మరింత వేగవంతం చేయాలని డీఆర్‌డీఏ పీడీ, మండల ప్రత్యేకాధి లక్ష్మీపతి సూచించారు. వమ్మవరం గ్రామంలో మండల, గ్రామ సచివాలయ అధికారులతో శనివారం సమావేశమయ్యారు. నిర్మాణంలో ఉన్న జగనన్న కాలనీ ఇళ్ల పురోగతి, ఆటంకాలకు గల కారణాలు తెలుసుకున్నారు. పునాదులు నిర్మాణం చేసిన పిదప మట్టి నింపుకోవడానికి అనుమతులు ఇబ్బందులు ఎదురవుతున్నాయని సర్పంచ్ పాపారావు, ఎంపీటీసీ బాలం సూరిబాబు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ప్రత్యేకాధికారి అన్నారు. ఈ సందర్భంగా మండల అధికారులు సచివాలయ భవనాలు, వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణం, రైతు భరోసా కేంద్ర భవనాలు మిగిలినవి త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో రామచంద్రమూర్తి, మండల ఇంజినీరింగ్ అధికారి దుర్గా శంకర్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీనివాస్,ఏపీఎం శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశం అనంతరం జగనన్న కాలనీల నిర్మాణాలను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి

ఘనంగా సంక్రాంతి సంబరాలు

అనకాపల్లి రూరల్/అనకాపల్లి టౌన్ : పట్టణంలోని విద్యాలయాల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు శనివారం ఘనంగా జరిగాయి. ప్లేస్కూల్ చిన్నారులు హరిదాసుల వేషధారణలతో ఆకట్టుకున్నారు. భోగి మంట వెలిగించారు. కరస్పాండెంట్ శెట్టి గిరీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఓ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన వేడుకలను ఆ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వసంత రాజేంద్ర ప్రసాద్ ప్రారంభించారు. విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణతో పాల్గొన్నారు. విద్యార్థినులు వేసిన రంగవల్లులు అలరించాయి. సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. సంక్రాంతి ఫ్యాషన్ డ్రెస్ కాంపిటీషన్ నిర్వహించి బహుమతులు అందజేశారు.



హరిదాసు వేషధారణతోపాటు సంప్రదాయదుస్తుల్లో చిన్నారులు

టెన్త్ విద్యార్థులను టీవీ, ఫోన్లకు దూరంగా ఉంచండి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయులు శాంతిప్రసూన



హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులు

ఎస్.రాయవరం : పరీక్షలకు వెళ్లే విద్యార్థులను ఇళ్లలో టీవీ, సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంచాలని దార్లపూడి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శాంతి ప్రసూన అన్నారు. పాఠశాలలో శనివారం పదో తరగతి చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. మార్చి నెలలో విద్యార్థులకు 10వ తరగతి పరీక్షలు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ ఉత్తీర్ణత సాధించడమే కాకుండా మంచి మార్కులు వచ్చే విధంగా శిక్షణ ఇస్తున్నామన్నారు. విద్యార్థులు చదివే చదువు వారికి పూర్తి ఫలితం ఇవ్వాలంటే ఇంటి వద్ద తల్లిదండ్రులు సహకారం కూడా అవసరం అన్నారు. ఇప్పుడు ప్రతి ఇంట్లో టీవీ, ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్లు ఉన్నాయని, పిల్లలు ఎక్కువగా వాటిని చూస్తున్నారన్నారు. అయితే పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులను చదువు వైపు దృష్టి మరలేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కూడా విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు.

రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి



రైతులకు రాయితీపై పొద్దు తిరుగుడు విత్తనాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

మునగపాక : ప్రభుత్వం అందించే రాయితీ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు (కన్నబాబు) కోరారు. గంటవానిపాలెంలో శనివారం రైతులకు రాయితీపై పొద్దు తిరుగుడు విత్తనాలు అందజేశారు. రబీ సీజన్‌లో రైతులకు అవసరమయ్యే విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచామన్నారు. ఆర్‌బీకే ద్వారా రైతులకు మెరుగైన సేవలందిస్తున్నామన్నారు. వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, పార్టీ సీనియర్ నేత అరిగా శ్రీనివాసరావు, సర్పంచ్ కోన వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

కిశోర బాలికల ఆరోగ్యంపై అవగాహన



మండల సమాఖ్య మందిరంలో అవగాహన సమావేశం

ఎస్.రాయవరం : కిశోర బాలికలు రక్తహీనత, ఇతర ఆరోగ్య సమస్యలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సర్వసిద్ధి పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ అనూష అన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు మండల సమాఖ్య కార్యాలయంలో స్వయం సహాయక సంఘాల, ఐకేపీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిశోర బాలికలకు అందించాల్సిన పోషకాహారం, ఇతర సమస్యల పరిష్కారానికి కావాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఏపీఎం కె.శివప్రసాద్ మాట్లాడుతూ కిశోర బాలికలకు, బాలికల తల్లిదండ్రులకు అవగాహన కల్పించేందుకు గ్రామాల వారీగా గ్రామ సమాఖ్య సభ్యులు, స్వయం సహాయం సంఘాల సభ్యులతో సమావేశాలు నిర్వహిస్తామన్నారు.

రైతు శ్రేయస్సుకు ప్రభుత్వం చేయూత



యలమంచిలి వ్యవసాయ కార్యాలయంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

యలమంచిలి : రైతుల శ్రేయస్సుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో తోడ్పాటునందిస్తున్నారని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబు) అన్నారు. శనివారం సాయంత్రం యలమంచిలి వ్యవసాయ కార్యాలయం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులను ధాన్యం కొనుగోలుపై వచ్చే ప్రతిఫలం, ప్రభుత్వం అందిస్తున్న సేవలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు పండగ వాతావరణంలా ఉందని, ప్రభుత్వం నేరుగా రైతుల వద్ద నుంచి గిట్టుబాటు ధర అందించి దళారుల చేతిలో మోసపోకుండా ఆదుకుంటున్నదని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఎటువంటి అవకతవకలు జరగకుండా 21 రోజుల్లో 2వేలు నలభై రూపాయలు ధరను రైతులకు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అని పేర్కొన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు రొంగలి జగన్నాథం, ఎంపీపీ గోవింద్, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరావు, అర్రెపు గుప్తా, పట్టణ వైఎస్సార్‌షీపీ అధ్యక్షుడు బొద్దపు యర్రయ్య దొర, కొల్లి త్రినాథ్, కర్రి శివ, గంధం శివ వ్యవసాయాధికారిణి ఉమాదేవి, దేముడు తదితరులు పాల్గొన్నారు.

గోదాదేవికి సారె సమర్పణ



భక్తులు సమర్పించిన సారె



గోదాదేవి అమ్మవారికి సారె చూపిస్తున్న మహిళలు

పాయకరావుపేట: పట్టణంలో గల శ్రీరాధారుక్మిణీ సహిత పాండురంగ దేవస్థానంలో గోదాదేవికి శనివారం భక్తులు సారె సమర్పించారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి పండ్లు, స్వీట్లు, పూలు, అరటిపండ్లు, కొబ్బరికాయలు తదితర సారె సామగ్రిని వికాస తరంగిణి భక్తులు సమర్పించారు. ఆలయంలో లక్ష్మీనారాయణ పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు యియ్యుణ్ణి కృష్ణస్వామి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నరిసే వెంకటేశ్వరరావు భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు.

మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి



జెడ్సీవెంకటరమణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత

అనకాపల్లిటౌన్: జోన్ పరిధిలో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్టు బదిలీపై ఇక్కడికి వచ్చిన జెడ్సీ ఎస్.వెంకటరమణ తెలిపారు. శనివారం ఆయన వేల్పుల వీధి, గవరపాలెం, గాంధీ నగరాల్లో పర్యటించి, అక్కడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు. జోన్ కమిషనర్‌ను 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.